## కుర్చీలో కూర్చుంటేనే . . .

ఆ కుర్చీలో
కూర్చోటమే చదువైనట్టు
జీవితాంతం అదే బతుకైనట్టు
అందుకోసమే ఆకాశం నుండి ఊడి పడ్డట్టు
ఆ కుర్చీ తెగ సంబరపడి పోతుంటుంది
అక్కడ కుర్చీల్లో భేదాలను బట్టి హోదాల బట్టి
దర్జా మోతాదు ఒలక బోస్తుంటుంది
చేరిన కొన్నాళ్ళకే –
కొన్ని కుర్చీలు కునుకు తుంటాయి
కులాసా కబుర్లతో అటూ ఇటూ దొర్లుతుంటాయి
కుర్చీని కాపాడుకుంటూ
చిన్న కుర్చీలు పెద్ద కుర్చీలుగా ఎగబాకుతుంటాయి
కుర్చీగా కనిపించినంత సేపూ
భారాన్నంతా అవే మోస్తున్నట్టు
ఉస్సురుస్సుమని తెగ ఆయాసపడిపోతాయి
కుర్చీ ఏదైనా సరే
ఎదురుగా దీనంగా నిల్చున్న తాహతుకి
అధికార భాష వాడాలో
ఆదరంగా మాట్లాడాలో ఆలోచిస్తాయి
కారులో కుర్చీలా కులికే దెలానో
కనీసం మేడలో మిడిసి పడేదెలానో
ప్రణాళికల మీద ప్రణాళికలు తయారు చేస్తుంటాయి
బరువంతా మోసే బండ కుర్చీలు కొన్నయినా ఉంటాయి కదా!

వాటి మీద బరువెలా మోపాలో
బాధ్యతల దుమ్ము ఎలా దులపాలో

అభినందనలు వస్తేగిస్తే జేబులో ఎలా వేసుకోవాలో
అవమానాల్ని ఏ కింది కుర్చీలకు ఎలా అతికించాలో
ప్రదక్షిణలు చేసి ప్రసాదాలు పంచి
ప్రమాదాల్లో కొమ్ముకాసి
చుట్టూ మోకరిల్లే మోజు కుర్చీలను
ఎలా కాపాడుకోవాలో
ఏ అందలం ఎప్పుడు ఎక్కించాలో
పెద్ద కుర్చీల నేర్పుకి నిదర్శనంగా మిగులుతుంటాయి

ఎన్నెన్ని కుర్చీలుగా మారినా
వదిలేసిన ఏ కుర్చీనైనా
పనిపడ్డప్పుడు పలకరించినపుడు
చాలా కొత్తగా వింతగా వెక్కిరించినట్టుగా
వెర్రి వెర్రిగా చూస్తూ
తను రాసి వదిలేసిన రాతల్ని
కాలు విరిగిన కుర్చీని చూపించినట్టే చూపిస్తాయి.